క్లుప్తంగా

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



ఏలూరుపాడులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరంలా నిలిచిందని ఏలూరుపాడు సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు అన్నారు. మంగళవారం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంతెన రామకృష్ణరాజు, దాట్ల రామభద్ర రాజు, కోనా జోసెఫ్, ఎంపీడీవో ప్రభాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక 23వ వార్డులో చినపేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం దళిత నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. చినపేట యూత్‌ను అభినందించారు. కార్యక్రమంలో దళిత నాయకులు గంటా సుందర్‌కుమార్, ఏలేటి న్యూటన్, చిగురుపాటి రాజు, కోనా జోసెఫ్, పిల్లి మునలయ్య, ఈది రవికుమార్, పోతుల జక్రి, కొత్తపల్లి విక్టర్, ఈది రాజశేఖర్, తాళ్లూరి రాజకుమార్, కొణాల బన్ను, చినపేట యూత్ పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



గుత్తుల శ్రీనివాస్, అధ్యక్షుడు



పెన్మెత్స సాయివర్మ, ప్రధాన కార్యదర్శి

భీమవరం: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుత్తుల శ్రీనివాస్, పెన్మెత్స సాయివర్మ ఎంపికైనట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలో జరిగిన జిల్లా 77వ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ రుణాలు, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హోమ పూజలు



కవిటంలో రుద్రహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పోడూరు: కవిటం గ్రామంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు హోమ పూజలు, యాగ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు రుద్రహోమం, అరుణహోమం, చండీ హోమం, ఈశ్వరునికి రుద్రపారాయణల అభిషేకం తదితర పూజలు చేశారు. శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి, భారతీయ ధర్మపరిషత్ జాతీయ అధ్యక్షులు కృష్ణచరణానంద భారతీస్వామి పూజల్లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు యాగ మహోత్సవాల్లో పాల్గొన్నారు. జంధ్యాల శ్రీనివాసశర్మ (నెలమూరు శర్మ), గుడిమెట్ల రామకనకారెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, మేడపాటి రామారెడ్డి, కర్రి రామిరెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, బాలాజీరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిగ్రీ కళాశాలలో సరస్వతి పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతిదేవి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలతో విద్యార్థులందరూ ఉత్తమ విద్య నభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వసంత పంచమి సందర్భంగా గీతామందిరం గురువులు స్వామీ రామానంద గిరి మహారాజ్ ఆధ్వర్యంలో కళాశాలలో సరస్వతి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, శీరం ఆనందకృష్ణ, కేవీఎల్ నరసింహరాజు, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకివీడు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నర్సింహరాజు

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక 6,7,9,20 వార్డుల్లో నగర పంచాయతీ నిధులు రూ.26 లక్షలతో చేపట్టబోయే 5 సీసీ రోడ్లు, 4 డ్రెయిన్ల నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆకివీడు పంచాయతీ అభివృద్ధికి గత పాలకులు ఏమీ చేయలేదన్నారు. పలు వీధుల్లో మట్టి రోడ్లు, కచ్చా డ్రెయిన్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించినట్లు చెప్పారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని ఆర్ అండ్ బీ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దొరగారి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అమృత్ పథకం నిధుల మంజూరుతో పట్టణంలోని పలు వార్డుల్లో కొత్త పైప్‌లైన్ల నిర్మాణం చేపడతామని నర్సింహరాజు వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, తిరుమానేని మాధవి, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, ఎండీ జక్కీ, వార్డు ఇన్‌చార్జులు కుంచాడ బాబ్జీ, తిప్పా దుర్గాభవాని, ఎండీ ఆలీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, పట్టణ జేసీఎస్ అధ్యక్షుడు శిరపు శ్రీనివాస్, యర్రా కేశవ, ఎం.రత్నకుమార్, జోసఫ్‌రాజు, మన్నే పోతరాజు, కుకంట్ల దానయ్య, పడాల కిషోర్‌రెడ్డి, జోగి నాగరాజు, దేవస్థానాల చైర్మన్లు బి.మాధవరెడ్డి, గునుకుల కొండయ్య, సన్నిధి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా మోటార్ వాహన చట్ట సవరణ



మాట్లాడుతున్న లక్ష్మయ్య

భీమవరం: మోటార్ వాహన చట్ట సవరణ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పాలనకు నిదర్శమని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటార్ వాహన చట్ట సవరణకు వ్యతిరేకంగా భీమవరం ఏరియా ఆక్వా అనుబంధ పరిశ్రమల వెహికల్స్ డ్రైవర్స్ యూనియన్, జై శ్రీ భారత్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఎస్కే బాషా అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, పార్లమెంట్‌లో ఏకపక్షంగా మోటార్ వాహన చట్ట సవరణ చేసి ఆమోదించడం దారుణమన్నారు. జాతీయ రహదారులను నిబంధనలకు అనుగుణంగా నిర్మించడం లేదని లక్ష్మయ్య ఆరోపించారు. ఈనెల 16న రైతులు, కార్మికులు చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో రవాణా కార్మికులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, తోట రామకృష్ణ, జి.కోటి, పితాని శ్రీనివాస్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



దొంగపిండిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పని ఒత్తిడిలో పడి చిన్నపాటి అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల పైకి తెచ్చుకోవడమే కాక చివరిలో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వేలకు వేలు ఖర్చు పెడుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనైనా చేయవచ్చన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్యాన్ని అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారన్నారు. వైద్యాధికారిణి అరుణ రాణి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్యాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, ఎంపీహెచ్‌వో, హెల్త్ అసిస్టెంట్లు, కార్యదర్శి కిరణ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన విద్యాబోధన



నైపుణ్యాభివృద్ధిపై వివరిస్తున్న మధుభూషణరావు

భీమవరం: నైపుణ్యాభివృద్ధితో విద్యాబోధనలో నాణ్యత పెరుగుతుందని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుభూషణరావు అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే, ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భీమవరం మండలంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను డిగ్రీ కళాశాలలకు తీసుకువచ్చి కళాశాలలోని మౌలిక సదుపాయాలను చూపించి డిగ్రీలో చేరాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, అధ్యాపకులు పి.అరవింద్‌స్వామి, కాకుమాని శ్రీనివాసరావు, ఎస్‌డీవీ సత్యనారాయణ, ఎల్.నర్సింహరావు తదతరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం విరాళం



బంగారం అందిస్తున్న ధనరాజ్ సెల్వి దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి మంగళవారం భీమవరానికి చెందిన ధనరాజ్ సెల్వి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం పలికి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

దేవస్థానం ఏసీగా మహాలక్ష్మీ నగేష్

శ్రీ మావుళ్లమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ నియమితులయ్యారు. విశాఖపట్నంలోని సత్యనారాయణస్వామి ఆలయ ఏసీగా పనిచేస్తూ బదిలీపై అమ్మవారికి దేవస్థానానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఈవో యర్రంశెట్టి భద్రాజీ పదోన్నతిపై చిత్తూరు జిల్లా బదిలీ అయ్యారు.

ఆలోచించి ఓటేస్తే ఉజ్వల భవిష్యత్



ఓటుహక్కు సక్రమ వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటు నమోదుతో పాటు ఆహక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెరుకువాడ రంగసాయి అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఆటో యూనియన్ నాయకులతో ఓటు హక్కు వినియోగం ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై డ్రైవర్స్ తో ర్యాలీ సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగసాయి మాట్లాడుతూ మనమంతా ప్రజా స్వామ్య పరిరక్షణలో భాగంగా నీతికి పట్టం కట్టాలని అన్నారు. సంఘటితంగా అందరం సుస్థిర పాలకులు ఎన్నుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగ కూడదని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమవరం టౌన్ వైడ్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు జీవితం ఆదర్శనీయం



విద్యార్థినులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: తొలి మహిళా గవర్నర్, కవయిత్రి స్వర్గీయ సరోజినీ నాయుడు జీవితం విద్యార్థినులకు ఆదర్శం కావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సరోజినీ నాయుడు జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు స్వాతంత్ర్య సమరయోధురాలిగా మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. విద్యార్థినులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఇందిర, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, మోరా జ్యోతిరెడ్డి, అంబటి రమేష్, ఎండీ జక్కీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

పెనుగొండ: ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు నివారణతోపాటు ప్రాణాలకు భరోసా ఉంటుందని తణుకు సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సంజీవ కుమార్ అన్నారు. రోడ్ సేఫ్టీ మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, విశ్వతేజ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అధిక స్పీడు, అవగాహన లేని డ్రైవింగ్, ఈగో ఫీలింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్ మాట్లాడడం వంటి వాటి వల్ల ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వీటిని తగ్గించుకోవాలని సంజీవకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సీనియర్ ట్రైనింగ్ డైరెక్టరు ఎంవాసు, జమ్మయ్య, విశ్వతేజ ప్రిన్సిపాల్ పులిదిండి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎన్ శ్రీనివాస్, పి.మీరయ్య, మహేష్‌లు పాల్గొన్నారు.

ల్యాబ్ నిర్వాహకుల వినతి

పాలకొల్లు అర్బన్: ల్యాబ్ నిర్వాహకుల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం క్షీరపురి ల్యాబ్ టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో గుడాల గోపికి వినతిపత్రం అందజేశారు. ల్యాబ్ నిర్వాహకులు ఎండీ పైథాలజిస్టు పర్యవేక్షణలో ల్యాబ్‌లను నడపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ జీఓ జారీ చేసిందని, ఇది బేసిక్ ల్యాబ్ నిర్వాహకులకు సాధ్యం కాదని తెలిపారు. గోపిని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు టీహెచ్‌వీఎల్ నారాయణ, కార్యదర్శి పి.రవికుమార్, కన్వీనర్ షేక్ సయ్యద్ బాజీ, ఉపాధ్యక్షుడు జి శ్రీనివాసరావు, జుత్తిగ ప్రసాద్, ల్యాబ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.77.96 లక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.77,96,822ల ఆదాయం సమకూరింది. 60వ వార్షిక మహోత్సవాల్లో 30 రోజుల పాటు భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను సోమ, మంగళవారాలు రెండు రోజుల పాటు లెక్కించారు. మొదటి రోజు రూ.63,98,749లు, రెండో రోజు రూ.13,98,073ల ఆదాయం లభించింది. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ మాట్లాడుతూ మొత్తం ఆదాయం రూ.77,96,822లు, బంగారం 68.800 గ్రాములు, వెండి 221 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, ఈవోలు కర్రి శ్రీనివాస్, ఎం.అరుణ్ కుమార్, దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేషగిరి(గిరి), మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, బ్యాంక్, రెవెన్యూ, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

15న పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

భీమవరం: గ్రూప్స్, డీవైఈఓ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీన భీమవరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో విద్యావేత్త, పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. సదస్సు అనంతరం ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేయనున్నారు.

నేడు కాళ్ల మండల పరిషత్ సమావేశం

కాళ్ల: కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు మంగళవారం తెలిపారు. సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయం భూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవన నిర్మాణానికి దాతలు రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఈవో మోకా అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఏలూరు జిల్లా భుజబలపట్నం వాస్తవ్యులు కనుమూరి మురళీకృష్ణంరాజు, సత్యవతి దంపతుల కుమారులు వెంకట సుబ్బరాజు, సీతారామరాజు అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

విజిలెన్స్ దాడులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్‌లో మంగళవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ మాట్లాడుతూ గడువుతీరిన క్రిమి సంహారక మందులు నిల్వ ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు అష్ట ఐశ్వర్య ఆగ్రో ఏజెన్సీలో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. రెవెన్యూ, పౌరసరఫరా అధికారులతో కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో రూ. 363780 విలువల గల 308.50లీటర్ల గడువు తీరిన క్రిమి సంహారకాలు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే అనుమతులు లేకుండా రూ. 17,700 విలువ చేసే 1430 కేజీ వేప పిండిని నిల్వ చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం రూ. 381480 విలువైన స్టాక్‌ను సీజ్ చేసి షాప్ యజమాని చక్కా వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో పి.సురేష్, అగ్రికల్చర్ ఏడీ సీహెచ్ శ్రీనివాసు, ఏవో ఎన్.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

గురుతర బాధ్యత 'గోరుముద్ద'

- మధ్యాహ్న భోజనానికి పెరుగుతున్న ఆదరణ
- పౌష్టికాహారంతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఐరన్
- మూడేళ్లు పూర్తి అవుతున్న మహత్తర పథకం



వేండ్ర హైస్కూల్లో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే ఆశయంతో వారు చదువు వారి తల్లిదండ్రులకు భారం కాకూడదని అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక అందజేస్తున్నారు. దీనికి తోడు పిల్లలను ఆకర్షించేలా నాడు-నేడుతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. జనవరి 21, 2020న జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రారంభించి ప్రత్యేక మెనూ రూపొందించారు. ప్రతి సోమవారం కూరగాయల పలావ్, గుడ్డు కూర, వేరుశనగ చిక్కి, మంగళవారం పులిహోర, పచ్చడి, ఉడించిన గుడ్డు, బుధవారం కూరగాయల భోజనం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి, గురువారం సాంబారు, ఉడికించిన గుడ్లు, శుక్రవారం ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి, శనివారం ఆకుకూర పప్పుచారు, తిరి పొంగలి మెనూలో పొందుపరచారు. అలాగే మంగళవారం, గురువారం , శనివారం రాగి జావా అందజేస్తున్నారు. దీంతో 95శాతం విద్యార్థులు గోరుముద్దను ఇష్టంగా తింటున్నారు. ఉండి నియోజకవర్గ పరిధిలో పాలకోడేరు మండలంలో 43 ప్రాథమిక, 11ఉన్నత పాఠశాలలు ఉండగా 4324మంది విద్యార్థులకు, ఆకివీడు మండలంలో 44ప్రాథమిక, 8 హైస్కూల్స్ ఉండగా 4,798, కాళ్ల మండలంలో 51 ప్రాథమిక, 9 హైస్కూల్స్ ఉండగా 5,253, ఉండి మండలంలో 54ప్రాథమిక, 8 హైస్కూల్స్ ఉండగా4,006 మంది విద్యార్థులు ఉన్నారని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఆకివీడు మండలంలోని పాఠశాలల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు ఆధ్వర్యంలో భోజనం తయారు చేస్తున్నారు. పాలకోడేరు మండలంలో ప్రాథమిక పాఠశాలలోను కొన్ని హైస్కూల్లో భోజనం తయారు చేస్తుండగా, ఉండి మండలంలో ప్రాథమిక పాఠశాలలోనే భోజనం తయారు చేస్తున్నారు. కాళ్ల మండలంలో ప్రాథమిక పాఠశాలలో కొన్ని హైస్కూల్లో పాఠశాలలోనే భోజనం తయారు చేస్తుండగా మిగిలిన పాఠశాలలకు చైతన్య గోదావరి ఏజెన్సీ ద్వారా బయట నుంచి మధ్యాహ్న భోజనం సరఫరా అవుతోంది. ప్రతి పాఠశాలలో ఆరోగ్య ప్లాంటు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందజేస్తున్నారు. వీటి పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారులను నియమించడంతో పని బారం తగ్గింది.

భోజనం చాలా రుచిగా ఉంటుంది

మధ్యాహ్న భోజనం ఎంతో రుచిగా ఉంటుంది. నిత్యం ఒక మెనూ ప్రకారం భోజనం అందించడంతో ఆసక్తి పెరిగింది. స్నేహితులతో కలిసి భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– లిఖిత శ్రీ, పదో తరగతి, వేండ్ర హైస్కూల్

పిల్లల్లో ఐరన్ శాతం పెరిగింది



పిల్లల్లో ఐరన్ శాతం పెరిగింది. భోజనంలో లోపం ఉంటే ఫిర్యాదులు స్వీకరించేలా ఒక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశాం. పోషక విలువలతో కూడిన భోజనం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో ఐరన్ శాతం పెరిగినట్లు ఆరోగ్య సురక్ష పరీక్షల్లో గుర్తించాం.

– జి.శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడు, వేండ్ర హైస్కూల్

విద్యార్థులకు ఒక వరం



ప్రభుత్వంజగనన్న గోరుముద్ద పథకం మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తరుచూ తనిఖీ చేస్తున్నాం. మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉండటంతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడానికి అవకాశం ఏర్పడింది.

– పీవీఎస్ నాగరాజు, ఎంఈఓ 1, పాలకోడేరు